సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

గురువారం । 5 । జనవరి । 2023



గీసుకొండ జాతరకు వేళాయె

వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రం శివారులో స్వయంభుగా వెలసిన లక్ష్మీనర్సింహా స్వామి జాతర రేపటి (శుక్రవారం) నుంచి నిర్వహించనున్నారు. - 8లో▸



పంట నష్ట పరిహారం విడుదల

గత సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారాన్ని విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29.5^0 / 19.3^0

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఉదయం, రాత్రి పొగమంచు కారణంగా చలి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'కంటి వెలుగు' ఏర్పాట్ల పరిశీలన



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని పీహెచ్‌సీని జెడ్పీసీఈఓ రఘువరన్ పరిశీలించారు. బుధవారం ఆయన పీహెచ్‌సీలోని వసతులు, ఇతర సామగ్రి గురించి వైద్యాధికారిని సుస్మితను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 18న రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నందున పీహెచ్‌సీలో ఏర్పాట్లపై ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ శంకర్, ఎంపీటీసీ మమత, కార్యదర్శి సత్యనారాయణ, హెచ్‌ఈఓ స్వామి, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేడు సమీక్ష

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 18న ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమంపై నేడు (గురువారం) జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్ హౌస్‌లో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమీక్ష సమావేశానికి రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ హాజరకానున్నారు. కార్యక్రమ నిర్వహణ, ఏర్పాట్లపై కలెక్టర్, వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్షించనున్నారు.

దేశాభివృద్ధిని చూసి పార్టీలో చేరిక



భూపాలపల్లి రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న దేశ అభివృద్ధిని చూసి బీజేపీలో చేరుతున్నారని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. బుధవారం సీఆర్‌నగర్‌లో పార్టీ అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, దేశ అభివృద్ధిని చూసి యువత పార్టీలో చేరుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం వివిధ పార్టీల నుంచి 50 మంది బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్, పార్టీ రాష్ట్ర నాయకులు చందుపట్ల సత్యాపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల గణపతి, నాయకులు తుమ్మేటి రాంరెడ్డి, మోరె రవీందర్‌రెడ్డి, ముత్యాల శ్యాం, జోరుకృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా!

కాళేశ్వరం: ఊరంతా నిద్రపోయిన తర్వాత గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అక్రమ రవాణాను ట్రాక్టర్ల యజమానులు యథేచ్ఛగా సాగిస్తున్నారు. రాత్రికిరాత్రే ఇసుకను ట్రాక్టర్లతో కాళేశ్వరం సమీపంలోని ఓ ఇసుక క్వారీ నుంచి తరలించి బీరసాగర్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టుకు తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రివేళల్లో ఇసుకను తరలిస్తున్నా.. సంబంధిత టీఎస్ఎండీసీ, రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు అటువైపు చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు పెండింగ్‌లో ఉన్న కరెంట్ బిల్లు బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఎస్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ భవేశ్‌మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో విద్యావలంటీర్లను నియమించాలని కోరారు. ఉపాధ్యాయుల ఖాళీలు అధికంగా ఉండటంతో బోధనపరమైన ఇబ్బందులు ఉన్నాయన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల స్థలాలు కబ్జాకు గురికాకుండా కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్‌తో ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, రఘుకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవాదుల పనుల్లో వేగం పెంచాలి
మంత్రి దయాకర్‌రావు

భక్తులకు సకల సదుపాయాలు

డిపోలను లాభాల్లోకి తీసుకురావాలి

- 10లో▸

అభ్యసన మేళా

ఉపాధ్యాయులతో టీఎల్‌ఎం ప్రదర్శనలు

- విద్యార్థులకు కృత్యాధార బోధనపై ప్రత్యేక దృష్టి
- త్వరలో జిల్లా స్థాయిలో భారీ ప్రదర్శన



టీఎల్‌ఎం ద్వారా పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

భూపాలపల్లి అర్బన్: ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'తొలిమెట్టు' కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. ఈ విద్యా సంవత్సరం ముగింపు నాటికి భాషా పరిజ్ఞానం (రాయడం, చదవడం)తో పాటు గణిత చతుర్విధ ప్రక్రియలు (కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారం)పై విద్యార్థులు పట్టు సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. కృత్యాధార బోధనకు బోధనోపకరణాలు కీలకమని 'తొలిమెట్టు' పర్యవేక్షణ బృందాలు ఇటీవల సర్వేలో తేల్చాయి. ఉపాధ్యాయులు తరగతి గదిలో ఉపయోగిస్తున్న చాక్‌పీస్, నల్లబల్ల కాకుండా విద్యార్థులు భాగస్వాములయ్యేలా ఆసక్తికరంగా బోధించే విధానాన్ని అవలంభించాలని సూచించాయి. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయుల బోధనోపకరణాలతో 'మేళా' నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. స్థానికంగా నిర్వహించే మేళాలో ఎంపిక చేసిన వాటిని రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఫలితంగా ప్రతి విద్యార్థి విషయాన్ని సులువుగా అర్థం చేసుకోవటమే కాకుండా, వారిలో ఆలోచనాశక్తి పెంపొందుతుందని భావిస్తున్నారు. మండల స్థాయిలో మేళాలను గత నెల 28వ తేదీ నుంచి ప్రారంభయ్యాయి. జనవరి 15లోపు జిల్లా స్థాయిలో, అనంతరం రాష్ట్ర స్థాయిలో మేళాను నిర్వహించనున్నారు.

ఉపాధ్యాయుల కసరత్తు..

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచే బోధనోపకరణాల తయారీకి ఉపాధ్యాయులు తమ మేథోశక్తిని ఉపయోగించాల్సి ఉంటుంది. మండల స్థాయిలో నిర్వహిస్తున్న మేళాలకు ఉపకరణాలు రూపకల్పనకు కొందరు ప్రత్యేకంగా సమయాన్ని కేటాయిస్తున్నారు. ఏదైనా అంశాన్ని వివరించే ఉపకరణం. ఒకటో తరగతి నుంచి ఐదోతరగతి వరకు ఉపయోగపడాలని జిల్లా విద్యా శాఖ అధికారులు సూచనలు చేశారు. బోధన సామగ్రి ఆకర్షణీయంగా,

బోధనతో మమేకమయ్యేలా..

విద్యార్థులకు పాఠాలు సరళంగా అర్థమయ్యేలా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉపాధ్యాయులు రూపొందించిన బోధనోపకరణాలను మేళాలో ప్రదర్శిస్తారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రదర్శనలను జిల్లా స్థాయికి, అక్కడి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. విద్యార్థి కేంద్రంగా పరిశీలన జ్ఞానంతో పాటు ఆలోచనలు రేకెత్తించేలా ఉపకరణాలుండాలని అధికారులు సూచిస్తున్నారు. బాహ్య, అంతర్గత పరిశీలనకు ఉపయోగపడే బోధన సామగ్రితో జిల్లా స్థాయి మేళాకు రావాలని ఉపాధ్యాయులకు పిలుపునిస్తున్నారు. బోధన సమయంలో ఉపాధ్యాయుడు విద్యార్థులతో మమేకమై స్వయంగా అభ్యసించేలా 'మేళా' దారి చూపుతుందని అధికారులు భావిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలు : 317

1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు:
10,029

ఉపాధ్యాయులు: 745

ఆహ్లాదకరంగా ఉండాలని చెబుతున్నారు. ప్రతి విద్యార్థి పాఠాలను సులువుగా అర్థం చేసుకునేందుకు ఉపకరణాలు ఉపకరించాలని స్పష్టం చేస్తున్నారు.



భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన మేళాను సందర్శిస్తున్న డీఈఓ

అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి

> తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు మేళా ఉపకరిస్తుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మేళాలు జరుగుతాయి. వీటి ద్వారా నాణ్యతమైన బోధనోపకరణాలు అందుబాటులోకి వచ్చే ఆస్కారముంది. జిల్లాలోని పలు మండలాల్లో ఇప్పటికే నిర్వహించాం. కలెక్టర్, అడిషనల్ కలెకర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. విడతల వారీగా సమీక్షలు కూడా నిర్వహిస్తున్నారు.
>
> - రాజేందర్, జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖాధికారి

సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్



మిర్చి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

టేకుమట్ల(రేగొండ): మిర్చి రైతులు దుక్కి నుంచే సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కీటక విభాగం ఐఐహెచ్‌ఆర్ బెంగుళూర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ అన్నారు. బుధవారం రేగొండ మండలంలోని రంగయ్యపల్లిలోని మిర్చి పంటలో అంతర తామర వ్యాప్తిని కీటక విభాగం శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ప్రస్తుతం అంతర తామర ఉధృతి తక్కువగా ఉందని, అంతర తామర నిర్మూలనకు ఒక హెక్టారుకి రెండున్నర టన్నుల మెటరైజియం, సుడోమోనస్ ఫ్లోరిషన్‌తో విత్తన శుద్ధి బ్యాక్టీరియా శిలీంధ్రాల నాశకాలను విరివిగా వాడాలన్నారు. యాంత్రిక పద్ధతిలో హెక్టార్‌కి 65–75 నీలిరంగు జిగురు అట్టలను వాడాలన్నారు. జీవ నియంత్రణ పదార్థాలైన వేప నూనెను తగు మోతాదులో పిచికారీ చేయాలన్నారు. అనంతరం కీటక విభాగం బెంగుళూర్ ప్రిన్సిపాల్ ఆర్‌ఆర్ చరన, డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ జూన్ మొదటి వారంలోనే మిరప నారు నాటితే పురుగు ఉధృతి నుంచి రక్షణ పొందవచ్చని, జీవ శిలీంధ్ర నాశనాలతో పాటు, సూక్ష్మపోషకాలను కలిపి వాడితే పురుగుల నుంచి రక్షణ సాధ్యమన్నారు. రసాయన మందులైన వేప నూనె, ఫిప్రోనిల్, లామ్డా సైహాలోత్రిన్ ఇమామెక్టిన్ బెంజోఎేట్, సయాంట్రినిప్రోల్ తగు మోతాదులో నీటిలో కలిపి పంటలపై పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటరమణప్ప, డాక్టర్ అనితకుమారి, డాక్టర్ సునీత, రవిశంకర్, నీలారాణి, కేంద్రీయ సమగ్ర సస్య రక్షణ కేంద్రం హైదరాబాద్, భూపాలపల్లి ఉద్యానశాఖ జిల్లా అధికారి సంజీవరావు, వరంగల్ ఉద్యానశాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రావు, సునీల్‌కుమార్, రమేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలతో విద్యార్థుల్లో ఉత్సాహం

డీసీఈబీ సెక్రటరీ చంద్రశేఖర్



ఉపకరణాలను తిలకిస్తున్న అతిథులు

మొగుళ్లపల్లి: విద్యాబోధనలో ఉపకరణాలు ఉత్సాహాన్ని కలిగిస్తాయని డీసీఈబీ సెక్రటరీ ఒంటేరు చంద్రశేఖర్, తహసీల్దార్ సుమన్ అన్నారు. బుధవారం మండలంలోని మొట్లపల్లి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బోధనోపకరణాల ప్రదర్శన (టీఎల్‌ఎం మేళా) మండల విద్యాశాఖాధికారి వేల్పుల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మండలంలోని 26 పాఠశాలల నుంచి నాలుగు సబ్జెక్టులకు సంబంధించిన ఉపకరణాలను ఉపాధ్యాయులు తయారు చేసుకొచ్చి ప్రదర్శించారు. ఈ సందర్భంగా డీసీఈబీ సెక్రటరీ చంద్రశేఖర్, మండల ప్రత్యేక అధికారి సునీత, తహసీల్దార్ సుమన్, ఎస్సై శ్రీధర్, సర్పంచ్ నరహరి పద్మ ముఖ్యఅతిథులుగా హాజరై టీఎల్‌ఎం మేళాను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచడానికి బోధించే క్రమంలో విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంచి ఆసక్తిని కలిగించడానికి బోధన ఉపకరణాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మూడు ఉత్తమ ఉపకరణాలను ఎంపిక చేసి ప్రశంసపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సారంగపాణి, మండల వైద్యాధికారి నాగరాణి, నవత, ఎస్ఎంసీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫోక్ డ్యాన్స్‌కు యశశ్రీ ఎంపిక

ఏటూరునాగారం: రాష్ట్రస్థాయి కల్చరల్ ఫోక్ డ్యాన్స్ పోటీలకు మండల కేంద్రానికి చెందిన పర్వతాల యశశ్రీ ఎంపికైంది. ములుగు జిల్లా కేంద్రంలోని డీఎల్‌ఆర్ గార్డెన్స్‌లో బుధవారం యూత్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహించారు. ఇందులో యశశ్రీ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

పోలీసులు మాత్రమే తుపాకులు పట్టాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న డీఎస్పీ

కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

పలిమెల: తుపాకులు కేవలం పోలీసులు మాత్రమే పట్టాలని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాన్ని కాపాడే పోలీసులు మాత్రమే తుపాకులు పట్టాలని, ఇతరులు పడితే ద్రోహులవుతారన్నారు. అనంతరం గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రజలు పాల ఉత్పత్తులు, గేదెల పెంపకం, కోళ్ల పెంపకం, కూరగాయల సాగు తదితర ఉత్పత్తులపై దృష్టి సారించాలన్నారు. కష్టపడి పని చేసుకుంటామని ముందుకు వస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సబ్సిడీ రుణాలు పొందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ కిరణ్, ఎస్సై అరుణ్, సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవర గుట్ట జాతరను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కాటారం: కాటారం మండలం ప్రతాపగిరి గుట్టపై ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రతాపగిరి గొంతెమ్మ లక్ష్మీదేవర గుట్ట జాతరను విజయవంతం చేయాలని కోరుతూ జాతర నిర్వాహణ కమిటీ సభ్యులు బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ 20న లక్ష్మీదేవరకు కాళేశ్వరంలో గోదావరి స్నానం, ప్రతాపగిరి కోటలోని మేలు దర్వాజ వద్ద మైసమ్మ పూజలు, గొంతెమ్మ గుడికి లక్ష్మి దేవర ప్రయాణం, 21న అమ్మవార్లు, స్వామివార్లకు అభిషేకాలు, పట్నాలు వేయడం, 22న పెద్దపట్నం తొక్కుట, శివసత్తుల నృత్యాలు, నాయకపోడు బృందాలచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి జాతర ముగించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గొంతెమ్మ, పాండురాజుల ఆశీర్వాదం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుంటి కిష్టయ్య, పాలం సంతోష్, దయ్యం వినోద్, చింతల సమ్మయ్య, పిట్టల మధునయ్య, ఆదివాసీ, తుడుం దెబ్బ సంఘాల నాయకులు మేకల తిరుపతి, రాంనేని సురేందర్, గుంటి రమేశ్, సుంకరి మల్లేశ్, గోరిక కిరణ్, కోలకాని సమ్మయ్య, బోద శివ, కుడిమెత చిన్న సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞాలు నిర్వహించడం అభినందనీయం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

మొగుళ్లపల్లి: లోక కల్యాణార్థం హనుమాన్ యజ్ఞాలు నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ ధర్మారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం 216వ యజ్ఞం కోసం మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో జరిగిన యజ్ఞంలో తెలంగాణ రాష్ట్ర హనుమాన్ ప్రచారకులు శ్రీరాములుతో కలిసి యజ్ఞం చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ లోక కల్యాణార్థం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హనుమాన్ దేవాలయాలకు వెళ్లి యజ్ఞాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు వేముల కిరణ్ గౌడ్, రుషీంద్ర చారి, అరవింద్ చారి, ఉప సర్పంచ్ పడిదల సరోజనబాపురావు, గ్రామస్తులు కుమారస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు పూర్తి చేయాలి

- ఐటీడీఏ పీఓ అంకిత్
- మినీ మేడారం పనులపై అధికారులతో పీఓ సమావేశం



మాట్లాడుతున్న పీఓ అంకిత్



హాజరైన అధికారులు

ఏటూరునాగారం: ఫిబ్రవరి 1వ తేదీ నుంచి జరగబోయే మినీ మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు భక్తుల సౌకర్యార్థం చేపట్టే పనులను సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మినీ మేడారం జాతరలో చేసిన ఏర్పాట్ల గురించి పీఓ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మినీ మేడారం జాతర 2023లో శాఖల వారీగా చేపట్టబోయే పనులు, ప్రతిపాదనలను పీఓకు అధికారులు వివరించారు.

తాగునీరు, బ్యాటరీ ఆఫ్ ట్యాప్‌లు..

ఇఫిల్ట్రేషన్ బావులలో పూడిక తీయించాలని, పాత బ్యాటరీ ఆఫ్ ట్యాప్‌లను సిద్ధం చేసి ఉంచాలన్నారు. మహిళలు బట్టలు మార్చుకునే రూంల నిర్మాణం, వాటర్ ట్యాంకుల్లో ఐరన్ మెష్‌ల ఏర్పాటు, ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా క్లోరినేషన్ చేసి తాగు నీటిని అందించాలని సూచించారు. ఇప్పటికే ఉన్న పైపులైన్లు, ట్యాంకులకు నల్లాలను బిగించి నీరు ఇవ్వాలని, బోరుబావుల్లో ఫ్లషింగ్ చేయాలని, చేతి పంపులు మరమ్మతులు చేపట్టాలన్నారు.

గ్రామాల్లో జాతరకు ఏర్పాట్లు చేయాలి

మండల పరిధిలోని కొండాయిలో కొలువై ఉన్న గోవిందరాజుల గుడివద్ద నిర్వహించే జాతర, ఐలాపురంలో జరిగే జాతరకు కావాల్సిన ఏర్లాట్లు చేయాలని పీఓ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవాలయాలకు పేయింటింగ్, విద్యుత్, నీటి సరఫరా ఏర్పాట్లు, లైటింగ్ ఏర్పాట్లతో తాత్కాలిక పార్కింగ్ స్థలాలను సిద్ధం చేయాలన్నారు. అలాగే సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ, ఐలాపురం, కొండాయి, మల్యాల, దొడ్లలో ఉన్న రోడ్లను బాగు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా భక్తులకు వైద్య సేవలు, ఉచితంగా మందులు అందించేందుకు తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అవసరం ఉన్న సామగ్రిని తెప్పించుకోవాలని సూచించారు. మినీ మేడారం జాతరను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల సంయుక్త తనిఖీల్లో అత్యవసర పనులకు అవసరమైన ప్రతిపాదనలను అందజేయాలన్నారు. కలెక్టర్ ద్వారా జాతరకు కావాల్సిన పనుల ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఓ వసంతరావు, ఏఓ దామోదరస్వామి, ఎస్ఓ రాజ్‌కుమార్, ఈఓ రాజేంద్రం, డీపీఓ వెంకయ్య, డీఎంహెచ్ఓ అప్పయ్య, ఈఈ సుభాష్, ఈఈ వెంకటకృష్ణ, ఎన్పీడీసీఎల్ డీఈఈ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలి

సమ్మక్క–సారలమ్మ మేడారం జాతరకు వచ్చే భక్తులకు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుకుండా చూడాలన్నారు. పరిసర ప్రాంతాల్లో క్లీనింగ్ కోసం కార్మికులను సమకూర్చాలని, సెప్టిక్ ట్యాంకులు, స్కావెంజర్లు, స్వీపింగ్ మెటీరియల్, యాత్రికుల షెడ్ల నిర్మాణం, చెత్తను డంపింగ్ యార్డులకు తరలించడానికి కూలీలు అవసరం ఉందన్నారు. విద్యుత్ సరఫరాకు డీటీఆర్‌లను సిద్ధం చేసి ఉంచాలని ట్రాన్స్‌కో అధికారులను పీఓ ఆదేశించారు. మేడారం జాతరలో విద్యుత్ సరఫరా, ట్రాన్స్ ఫార్మర్ల పరిస్థితి ఎలా ఉందని గిరిజన సంక్షేమశాఖ, ఎన్పీడీసీఎల్, దేవాదాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేసి రిపోర్ట్ ఇవ్వాలన్నారు.

'డబుల్' ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

చిట్యాల: డబుల్ బెడ్ రూం ఇళ్లు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. బుధవారం మండలంలోని గోపాల్‌పూర్‌లో డబుల్ బెడ్ రూం లబ్ధిదారులతో అవగాహన, సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు బిల్లులను వెంటనే చెల్లిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుప్పటి రజిత శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి శైలజ, ఎంపీడీఓ రామయ్య, పీఆర్ఏఈ రవికుమార్, తదితరులు ఉన్నారు.

ఘనంగా యువజనోత్సవాలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్ హౌస్‌లో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు–2023 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ బుర్ర సునీత ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసి, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేశారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి యువతీయువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించారు. నృత్యం, పాటల పోటీలతో పాటు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి పంపించడం జరుగుతుందని సునీత తెలిపారు.

క్లుప్తంగా

రేపటి నుంచి ఆగమ పరీక్షలు

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 6, 7వ తేదీల్లో అర్చక (ఆగమ) పరీక్షలు- 2022 నిర్వహించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అభ్యర్థులకు వరంగల్ మట్టెవాడలోని ఏవీవీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా అర్చక (ఆగమ) పరీక్షల నోడల్ అధికారి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్లలో జరిగే పరీక్షలకు అభ్యర్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరుకావాలన్నారు. కాగా, తొమ్మిదేళ్ల తర్వాత అర్చక (ఆగమ) పరీక్షలు నిర్వహించడం హర్షనీయమని రాష్ట్ర అర్చక, ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ అన్నారు. ప్రవేశ వర, ప్రవర పరీక్షలు ఆగమ శాస్త్ర పండితుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన 480 మందికి ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

పోలీసు ఉద్యోగ అభ్యర్థి ఆమరణ నిరాహార దీక్ష



ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన నాగరాజు

దోర్నకల్: మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలంలోని అందనాలపాడు గ్రామానికి చెందిన సండ్లపట్ల నాగరాజు బుధవారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టాడు. అందనాలపాడు గ్రామంలోని తన ఇంటి ఆవరణలో టెంట్ కింద దీక్ష చేపట్టాడు. ఈ సందర్భంగా నాగరాజు విలేకరులతో మాట్లాడుతూ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలో ఒక మార్కు తక్కువ రావడంతో తాను అర్హత కోల్పోయానని తెలిపాడు. ఏడు మల్టిపుల్ ఆప్షన్స్‌కు సంబంధించిన మార్కులు కలపాలని హైకోర్టు ఆదేశించినా కలపకపోవడంతో తాను ఈవెంట్స్‌లో పాల్గొనే అవకాశం కోల్పోయానని పేర్కొన్నాడు. కాగా, మార్కులు కలపాలనే హైకోర్టు ఆర్డర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తాను ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినట్లు నాగరాజు వివరించాడు.




గీసుకొండ జాతరకు వేళాయె

6, 7, 8వ తేదీల్లో నిర్వహణ

- గతంలో గుట్ట వద్ద బయటపడిన చారిత్రక ఆనవాళ్లు

వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రం శివారులో నల్లరాతి గుట్టపై స్వయంభు వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహా స్వామి జాతర ఈనెల 6, 7, 8వ తేదీల్లో వైభవంగా సాగనుంది. స్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ మేరకు జాతర ఏర్పాట్లను సైతం చేపడుతున్నట్లు ఆలయ వంశపారంపర్య వ్యవస్థాపక ధర్మకర్తలు వేదాంత మురళీకృష్ణమాచార్యులు, వెంకట నర్సింహాచార్యులు, భరద్వాజాచార్యులు తెలిపారు. చివరి రోజు సాయంత్రం స్వామివారి ఊరేగింపుతో గీసుకొండ వేణుగోపాలస్వామి ఆలయ ప్రవేశం చేయించడంతో జాతర ముగుస్తుందన్నారు.

\- గీసుకొండ



గీసుకొండ గుట్టపై ఆలయం



గీసుకొండ లక్ష్మీనర్సింహస్వామి మూల విరాట్

తరలిరానున్న భక్తులు..

కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ఇక్కడి లక్ష్మీనర్సింహస్వామి మహత్యం అనేక కథల రూపంలో ప్రచారంలో ఉంది. గతంలో పురావస్తుశాఖ వారు వెలికితీసిన చారిత్రక ఆనవాళ్లు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. జాతర సందర్భంగా వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లిస్తారు. స్వామి కొలువైన గీసుకొండ గుట్ట వద్ద రెయిలింగ్, మెట్లు, దిగువన ఆలయ నిర్మాణం, పలు అభివృద్ధి పనులను దాతలు ముందుకువచ్చి చేపట్టారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహకారంతో తగు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ దౌడు బాబు తెలిపారు. అయితే, గుట్టపై ఆలయ అభివృద్ధి, జాతర నిర్వహణపై పెద్దగా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జాతరకు వచ్చేవారికి సరైన సదుపాయాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

చారిత్రక ఆనవాళ్లు..

సుమారు 400 అడుగుల ఎత్తులో ఉన్న గుట్ట చుట్టూ సుమారు 70 ఎకరాల ప్రాంతంలో మధ్యశిలా యుగం మొదలుకొని శాతవాహనుల కాలానికి సంబంధించిన ఎన్నో చారిత్రక ఆధారాలు బయటపడ్డాయి. 2001లో తొలిసారి గీసుకొండకు చెందిన ఔత్సాహిక పురావస్తు పరిశోధకుడు ముత్తినేని రాధాకృష్ణ ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. మధ్యరాతి యుగానికి సంబంధించిన సూక్ష్మరాతి పనిముట్లు, నవీనశిలా యుగానికి సంబంధించిన గొడ్డళ్లు, నూరే రాళ్లు, మట్టి పెంకులు, బృహత్ శిలాయుగపు సమాధులు(మెగాలిథిక్ బరియల్స్) వెలుగు చూశాయి. అలాగే, హైదరాబాద్ నుంచి వచ్చిన పురావస్తుశాఖ వారు పరిశీలన కోసం నాలుగు ట్రెంచ్‌లు తవ్వడంతో మరిన్ని ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. మొదటి ట్రెంచ్‌లో బౌద్ధానికి సంబంధించిన స్థూపం బయటపడింది. దీనికి సంబంధించిన ఇటుకలు కూడా వెలుగు చూశాయి. అందులోనే బోధిసత్వుని తెల్లని ప్రతిమ బయటపడటంతో జిల్లాలోనే మొదటి బుద్ధిస్టు సైట్‌గా దీన్ని గుర్తించారు. దీంతో అప్పట్లో ఈ ప్రాంతం బౌద్ధ ఆరామాలకు నిలయంగా మారి ఉంటుందని పురావస్తు శాఖ నిపుణులు అభిప్రాయపడ్డారు. అలాగే, శాతవాహనులకు సంబంధించిన నాణెం కూడా లభించింది. ఈ విషయం గతంలో పార్లమెంట్‌లో సైతం చర్చకు వచ్చింది. అప్పటి కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి అనంతకుమార్ భారత ఆర్కియాలజికల్ సర్వే వారిని గీసుకొండ గుట్ట వద్ద అధ్యయనం చేయాలని ఆదేశించారు. అయితే, అధికారులు వచ్చి వెళ్లాక ఎవరూ పట్టించుకోకపోవడంతో విషయం మరుగునపడింది. ఇక్కడ లభ్యమైన చారిత్రక అవశేషాలు, ప్రతిమలు, టెర్రకోట బొమ్మలు, రాతి ఆయుధాలను వరంగల్ బల్దియా కార్యాలయం వెనకాల ఉన్న పురావస్తు మ్యూజియంలో భద్రపరిచారు. కాగా, గుట్ట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి మరింత లోతుగా పరిశోధనలు చేస్తే చారిత్రక క్రమం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

స్పాన్సర్ కోటాకు నోటిఫికేషన్

- 11న కౌన్సెలింగ్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని క్యాంపస్ కళాశాలలో వివిధ కోర్సులకు స్పాన్సర్ కోటా నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్ బుధవారం తెలిపారు. ఎంఎల్ఐఎస్సీలో 7 సీట్లు,(వార్షిక ఫీజు రూ.35వేలు), ఎమ్మెస్సీ బాటనీలో 4సీట్లు(వార్షిక ఫీజు రూ.48వేలు), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బయో టెక్నాలజీలో 6సీట్లు(వార్షిక ఫీజు రూ.46వేలు), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీలో 6 సీట్లు(వార్షిక ఫీజు రూ.46వేలు) ఉన్నట్లు పేర్కొన్నారు. సీపీ గేట్‌లో అర్హత సాధించిన వారు అర్హులని.. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ.150, ఇతరులు రూ.200 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ఈనెల 11న ఉదయం 11 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు స్కాలర్‌షిప్‌కు అర్హులు కాదని, స్పాన్సర్ కోటా నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ మేరకు దరఖాస్తుదారులు సంబంధిత స్పాన్సర్ సంస్థల నుంచి సిఫారసు లేఖను జత చేయాలని సూచించారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్ట్

నర్సంపేట రూరల్ : గంజాయి సేవిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు నర్సంపేట టౌన్ సీఐ పులి రమేష్‌గౌడ్ తెలిపారు. నర్సంపేటలోని మాధన్నపేట రోడ్డులో గల ఆర్యవైశ్య శ్మశానవాటిక వద్ద నర్సంపేటకు చెందిన వేములూరి భానుప్రసాద్, మహ్మద్ రహమత్, జగదీష్ అలియాస్ కోటి గంజాయి సేవిస్తుండగా దాడులు చేసినట్లు తెలిపారు. వీరిలో జగదీష్ పారిపోగా మిగతా ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాసరిపల్లికి చెందిన రాజాలు వద్ద వీరు గంజాయి కొనుగోలు చేసి చేసినట్లు తేలిందన్నారు.

తండ్రిని చంపిన కుమారుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

పాలకుర్తి టౌన్: భూ వివాదంతోపాటు సాగునీటి వాటా కోసం కన్న తండ్రిని చంపిన కొడుకును అరెస్ట్ చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామానికి చెందిన చిడిమిండ్ల నర్సిరెడ్డి(55)కి ఇద్దరు కుమారులు రాజు, రమేష్, కుమార్తె ఉన్నారు. అందరికి వివాహాలు జరిగాయి. నర్సిరెడ్డి తన వ్యవసాయ భూమిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచి ఇచ్చాడు. తన కోసం కొంత భూమిని ఉంచుకున్నాడు. భూ పంపకం విషయంలో తనకు అన్యాయం జరిగిందని పెద్ద కుమారుడు రాజు భావించాడు. తండ్రి చిన్న కుమారుడైన రమేష్‌కు అనుకూలంగా పంపకాలు చేశాడని తండ్రి, తమ్ముడితో తరుచూ గొడవకు దిగేవాడు. ఈ క్రమంలో డిసెంబర్ 28న వ్యవసాయ బావి వద్ద నీటి వాటా విషయంలో తండ్రి, తమ్ముడు రమేష్‌లతో రాజు గొడవపడ్డాడు. తండ్రిని చంపితే సమస్య పరిష్కారమవుతుందని భావించి డిసెంబర్ 29న ఒంటరిగా వ్యవసాయ భూమి వద్ద పనులు చేసుకుంటున్న తండ్రి నర్సిరెడ్డిపై పెద్ద కుమారుడు రాజు దాడికి దిగాడు. నారు మడిలోకి తోసేసి పిడిగుద్దులు గుద్ది గొంతు నులిమి హత్య చేశాడు. రక్తం అంటిన బట్టలను ఇంట్లో దాచి వారం రోజులు ఎవరికి దొరకకుండా తిరిగాడు. నిందితుడు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయి తండ్రిని హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రూ.లక్ష రుణం మంజూరైందని..

- రూ.16,240 కాజేసిన కేటుగాడు
- రఘునాథపల్లిలో సైబర్ మోసం

రఘునాథపల్లి: రూ.లక్ష రుణం మంజూరైందని ఓ మహిళకు మాయమాటలు చెప్పి ప్రాసెసింగ్, ఇన్సురెన్స్‌ల పేర రూ.16,240 కాజేసిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వీరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపల్లికి చెందిన ఓ మహిళ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. డిసెంబర్ 10న మెయిన్ బజార్ ఇండియాలో లోన్ కోసం ఆధార్, పాన్‌కార్డు నంబర్ వివరాలు పంపింది. ఆ తర్వాత గుర్తు తెలియని సదరు మహిళకు వ్యక్తి ఫోన్ చేసి మీకు రూ.లక్ష రుణం మంజూరైనట్లు తెలిపాడు. ప్రాసెసింగ్ ఫీజు రూ.3,250, ఇన్సురెన్స్ అంటూ రూ.12,990 పంపాలని కోరడంతో రెండు సార్లు ఫోన్‌పే ద్వారా పంపించింది. మరోసారి ఫోన్ చేసి రూ.9,000 పంపాలని కోరడంతో మోసపోయినట్లు గుర్తించింది. ఆ తర్వాత ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పు విషయంలో వేధించిన పీఏసీఎస్ చైర్మన్ అరెస్ట్

శాయంపేట : అప్పు విషయంతో వేధించి వ్యక్తి మృతికి కారణమైన హనుమకొండ జిల్లా శాయంపేట మండల పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్‌బాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన భూతాల సురేష్ అనే వ్యాపారికి అప్పు నిమిత్తం పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్‌బాబు రూ.20లక్షలు ఇచ్చాడు. కొద్ది రోజులకు అప్పు కట్టాలని కుసుమ శరత్‌బాబు – రమాదేవి దంపతులు సురేష్‌ను మానసికంగా, శారీరకంగా వేధించి ఇంటి డాక్యుమెంట్లు లాక్కున్నారు. దీంతో మనోవేదనకు గురైన సురేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో నిందితుడైన కుసుమ శరత్‌బాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పంట పరిహారం విడుదల

- 2021 డిసెంబర్, 2022 జనవరికిగాను..
- ఉమ్మడి జిల్లాలో 28,567 ఎకరాలకు రూ.13.76 కోట్లు విడుదల
- వారం, పది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ



తడిసిన మిర్చిని ఆరబెడుతున్న రైతులు (ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: 2021 డిసెంబర్, 2022 జనవరిలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కురిసిన వడగండ్ల వాన, ఈదురు గాలులతో మొక్కజొన్న, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు అధికారులు నష్ట పరిహారం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 25,937 మంది రైతులకు సంబంధించిన 28,252.65 ఎకరాలకుగాను రూ.13,76,24,922 పరిహారం విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రాహుల్ బొజ్జ డిసెంబర్ 20న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులు ఆర్థికశాఖ నుంచి కలెక్టర్లకు అక్కడి నుంచి వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారుల ద్వారా వారం, పది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమకానున్నాయి.

విడుదలైన పరిహారం వివరాలు (ఎకరాలు)

జిల్లా	రైతులు	మొక్కజొన్న(ఎకరాల్లో)	మిర్చి(ఎకరాల్లో)	వచ్చిన పరిహారం
హనుమకొండ	5,877	1722.3	4517.15	రూ. 3,01,33,380
వరంగల్	16,810	5244.775	13,233.55	రూ. 8,89,43,054
భూపాలపల్లి	2,417	-	2,536.325	రూ.1,36,96,155
మహబూబాబాద్	833	263.14	735.41	రూ.48,52,333
మొత్తం	25,937	7,230.215	21,022.435	రూ.13,76,24,922

పనికి వెళ్లొస్తానని చెప్పి..

- బైక్‌పై వెళ్తుండగా బస్సు ఢీ.. యువకుడి మృతి



కార్తీక్ (ఫైల్)

ఐనవోలు: పనికి వెళ్లొస్తానని చెప్పి బయటకు వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథినిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం.. ఉర్సు కరీమాబాద్‌కు చెందిన సంగ కార్తీక్(23) తండ్రి రాజు గతంలో చనిపోయాడు. తల్లి రాణి పున్నేలు క్రాస్ సమీపంలో ఉన్న వృద్ధాశ్రమంలో పనిచేస్తోంది. కార్తీక్ కొద్ది సంవత్సరాలుగా కక్కిరాలపల్లిలో తన పెద్దమ్మ భాగ్యమ్మ వద్ద ఉంటూ వరంగల్‌లోని బేకరిలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పెద్దమ్మ భాగ్యమ్మతో పనికి వెళ్లొస్తానని చెప్పి బైక్‌పై బయలుదేరాడు. పంథిని శివారులోని పెట్రోల్ పంపు వద్ద ఎదురుగా వస్తున్న సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్‌టీసీ హైర్ చేసుకున్న బస్సు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలై కార్తీక్ అక్కడికక్కడే మృతిచెందాడు. బస్సు డ్రైవర్‌ను ఎన్‌టీఆర్ జిల్లా(పూర్వ కృష్ణ) మునుకోల్ల మండలం తిరువూరుకు చెందిన దుబ్బాక వెంకయ్యగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి రాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్‌కి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26703]

HOUSE FOR SALE

■ ఉర్సుగుట్ట నుండి కాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26704]

బిల్డింగ్ అమ్మబడును

■వరంగల్ కరీమాబాద్ ఉర్సు దర్గా దగ్గరలో మెయిన్ రోడ్‌కు తూర్పు ఫేసింగ్ గల 200 గజాల బిల్డింగ్ అమ్మబడును. వివరాలకు వెంటనే సంప్ర။ 6300185339, 9347219693. [W-775936]

FOR SALE

■358 చదరపు గజాల ఖాళీ స్థలము నర్సంపేటలో గ్రైన్ మార్కెట్ మరియు మహబూబాబాద్ నేషనల్ హైవే రోడ్‌కి వాకబుల్ డిస్టెన్స్‌లో కలదు. సంప్ర။ సెల్: 9989705167. [WA-6453]

SERVICES

CHANGE OF NAME

■I, the undersigned MD RAFIYA SULTANA, W/o. GULAM RABBANI (New Name) previously called RAFIYA SULTANA, W/o. GULAM RABBANI (Old Name), R/o. H.No. 15-4-222, Rajiv Colony, Mattewada, Warangal Dist-506002, T.S., India, Solemnly declare. [W-775943]

అమ్మబడును

■రెడ్డి కాలనీ, KU మెయిన్ రోడ్ HNKలో గుడ్ రన్నింగ్‌లో ఉన్న చికెన్ షాప్ 8 కెమెరాస్, మోడరన్ డిజైన్ కలిగి, అన్ని వసతులతో అమ్మబడును. సంప్ర။ 8121142147, 9912664275. [WA-6455]

BUSINESS OFFER

■మీ ఖాళీ సమయాన్ని సైతం డబ్బుగా మార్చుకోవాలనుందా? మీరు ఫ్రీగా ఉండే సమయంలో నెలకు 10,000 నుండి 30,000 వేల సంపాదించండి. మీకు అన్ని రకాల స్కిల్స్ ఇచ్చి, మీ జీవితంలో ఉన్నత స్థాయికి చేర్చే అవకాశం మా దగ్గర ఉంది. Entry Fee 100 రూ/- Ph: 9701715710 అనిత [W-775937]

■పేపర్ ప్లేట్ & LED యంత్రాలను వ్యవస్థాపించి, ప్రతి నెల ఎక్కువ ఆధాయాన్ని సంపాదించండి, ఉచిత ముడి పదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్ : 7217656207, 9717434570 [HA-19385]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ။ అదనపు లైను 60/- రూ။లు మాత్రమే 5% GST అదనము

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్, బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు వున్నవి, మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. 95500 26206 [V-6031]

WANTED

■ Delicious Farms Chicken outlets is hiring for following positions in Warangal 1) Collection Executive / Delivery Executive (1-3 years in same domain), 2) Store Supervisor, Age: 20-35 yrs. Cont: 8106112401. [W-775944]

■ Wanted Office Assistant Vodafone Idea Limited (Reddy Colony Branch) Females only, Q: Any Degree Salary: 5500, Age:28yrs, below Whatsapp Your Resume and Passport Size Photo. Cont: 9160445505. [W-775942]

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 11000-14000/- సంప్ర။ 8688072125. [W-1144181]

■ అతి తక్కువ పెట్టుబడితో కంపెని నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి క్రొత్త రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ : 8465843194 [G-338]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776250]

■ లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీతం: 16k, ఏజెంట్ కమీషన్ 3k. ఫోన్: 9640300074. [HA-844]

■ స్టార్ హోంకేర్ HYD లో వృద్ధులకు పేషేంట్లకు సేవచేయుటకు, బేబి కేర్, ఇంటి పనికి స్త్రీ/పు కావలెను. జీతం: 16-30K ఫ్రీ వసతి + భోజనం. ఫోన్: 7306230594, 9182365449. [HA-776696]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మా కంపెనీ ఓల్డ్ రికార్డ్స్ చూసి న్యూ రికార్డ్స్ వ్రాయుటకు స్త్రీ / పురుషులు అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్: 76748 10229 [V-5593]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

గూడూరు: అప్పుల బాధ, అనారోగ్యంతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మర్రిమిట్ట శివారు తోటద్రసు తండాలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జరుపుల యాకయ్య(30) తనకున్న ఎకరంన్నర భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. సరైన దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి కోసం తెచ్చిన రూ.1.50లక్షల అప్పు ఎలా తీర్చాలోనని మనోవేదనకు గురయ్యాడు. దీనికితోడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పంట చేలో పురుగుల మందు తాగి అక్కడే పడిపోయాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యాకయ్య మృతి చెందాడు. కుటుంబ సభ్యులు బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మానసిక వేదనతో ఒకరు..



సోమయ్య (ఫైల్)

వర్ధన్నపేట: మానసిక వేదనకు గురై ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రామారావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుల్ల సోమయ్య(62)- కాంతమ్మ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగేళ్లుగా సోమయ్య మానసిక స్థితి సరిగా ఉండడం లేదు. దీంతో చికిత్స తీసుకుంటూ మందులు వాడుతున్నాడు. అలాగే, వీరి భూమికి వెళ్లడానికి పక్క రైతులతో భూ మార్పిడి చేసుకుని బండి బాట తీసుకున్నారు. దానికి సంబంధించిన కాగితాలు కూడా ఉన్నాయి. అయితే, పక్క రైతులు బాట లేదనడంతో విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పంట పూర్తయ్యాక కొలతలు వేయించి తగాదా తీరుస్తామని వారు చెప్పారు. కాగా, పది రోజుల నుంచి పక్క రైతులు బాట లేదని గొడవ చేస్తుండడంతో సోమయ్య తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. మంగళవానం భార్య కాంతమ్మ వ్యవసాయ పనులకు వెళ్లగా కుమారుడు, కోడలు బ్యాంకు పనిపై వర్ధన్నపేటకు వెళ్లారు. తిరిగి సాయంత్రం వారు ఇంటికి చేరుకోగా సోమయ్య కనిపించలేదు. ఆచూకీ కోసం వెతుకుతున్న క్రమంలో ఇంటి వెనుక ఉన్న ఓ పాత ఇల్లు సమీపాన షెడ్డులో ఉరి వేసుకుని సోమయ్య మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. వ్యక్తి మృతి



మురారి (ఫైల్)

గణపురం: బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం కర్కపల్లి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన కోపెల మురారి(28) తన తండ్రి కిష్టయ్యను డయాలసిస్ కోసం హనుమకొండలోని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆస్పత్రిలో ఆలస్యం కావడంతో తండ్రిని అక్కడే ఉంచి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో మండలంలోని కర్కపల్లి వద్దకు రాగానే భూపాలపల్లి నుంచి ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తల పగిలి మురారి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు ఉన్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



అనిల్ (ఫైల్)

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలో అయ్యప్ప దేవాలయం సమీపాన జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో అనిల్(35) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

‘అధికారం’ అండతో ఇష్టారాజ్యం..!

- గీసుకొండ ఇన్‌స్పెక్టర్ తీరుపై సర్వత్రా విమర్శలు
- సీపీ చర్యపై హర్షిస్తున్న ప్రజలు
- పలు గ్రామాల్లో బాణసంచా కాల్చి సంబురాలు

వరంగల్ క్రైం/గీసుకొండ: గీసుకొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లును సీపీ రంగనాథ్ సస్పెండ్ చేయడంపోలీస్‌శాఖలో సంచలనం రేపింది. దామెర ఎస్సై హరిప్రియతో ఆయన నడిపిన వివాహేతర సంబంధంపై గీసుకొండ మండలంలోనే కాదు వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఎక్కడ చూసినా పోలీసుశాఖ పరువు తీసేలా వ్యవహరించిన తీరును సామాన్యులతోపాటు పలు పార్టీల నాయకులు తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయడంతో ఏకంగా పలు గ్రామాల్లో బాణసంచా కాల్చి ప్రజలు సంబురాలు జరుపుకున్నారంటే ఆయన విధుల్లో వ్యవహరించిన తీరు ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. అయితే, గీసుకొండ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తదుపరి ఆయన పోలీస్‌స్టేషన్ సుందరీకరణ, క్వార్టర్లలో క్రీడా మైదానం, మొక్కల పెంపకం, కొమ్మాల ఆలయం వద్ద వాచ్ పోస్టు ఏర్పాటు చేశారు. వరంగల్-నర్సంపేట రహదారిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి చేపట్టిన చర్యల విషయంలో వెంకటేశ్వర్లుకు మంచి పేరు వచ్చింది. అప్పటి సీపీ తరుణ్‌జోషితోపాటు డీసీపీ వెంకటలక్ష్మి ఆయన పనితీరును అభినందించారు. అయితే, ఆయనలో మరో కోణం కూడా ఉందనే విషయాన్ని పోలీసు శాఖ విస్మరించిందనే ఆరోపణలు ఉన్నాయి. అధికార(అధికారం) పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల అండదండలు తనకు ఉన్నాయని మితిమీరిన తనంతో ఆయన చేసిన పనులు, చేపట్టిన చర్యలు అంతా ఇంతా కాదని పలువురు అంటున్నారు. అలాగే, సదరు ఇన్‌స్పెక్టర్‌కు ఆది నుంచి అధికారుల అండదండలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఓ జిల్లా స్థాయి అధికారి ఆయన ఆగడాలకు వంత పాడారనే ప్రచారం నడుస్తోంది. దీనికి కృతజ్ఞతగా సదరు అధికారి ఇంటి అద్దె, ఇంట్లోకి అవసరమైన సరుకులు తానే చక్కబెట్టేవాడని తెలుస్తోంది. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ తీసుకున్న నిర్ణయంపై ప్రతిపక్ష పార్టీల వారే కాదు అధికార పార్టీలోని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌స్పెక్టర్ వ్యవహార శైలిపై మచ్చుకు కొన్ని..

- ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వ నుంచి రూ.లక్షల విలువ చేసే మొరాన్ని అక్రమంగా తరలిస్తున్న వారికి అండగా ఉండి వారి నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు ఇన్‌స్పెక్టర్‌పై బలంగానే ఉన్నాయి.
- గంగదేవిపల్లిలో గతంలో గుప్త నిధుల కోసం చేపట్టిన తవ్వకాల సందర్భంగా అక్రమార్కుల నుంచి ఆయనకు భారీ మొత్తం అందిందనే విషయం అప్పట్లో గుప్పుమంది.
- కొమ్మాల ఆలయం వద్ద ఇటీవల బాల్య వివాహం జరగగా అడ్డుకున్న చైల్డ్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఐసీడీఎస్ అధికారులకు చుక్కలు చూపించి కేసు నమోదు చేయకుండా తాత్సారం చేసి బాలికను పోలీస్‌స్టేషన్‌లో పెట్టిన విషయంపై సీపీకి పలువురు ఫిర్యాదు చేయడంతో ఆయన మండిపడ్డట్లు తెలుస్తోంది.
- గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలో కొందరి భూమిని కబ్జాదారులు ఆక్రమించగా వారు సీపీని ఆశ్రయించారు. కబ్జాదారులకు అనుకూలంగా ఇన్‌స్పెక్టర్ రూ.లక్షలు తీసుకుని వారి మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. విషయం తెలిసి ఇన్‌స్పెక్టర్‌ను సీపీ మందలించినట్లు సమాచారం.
- సరైన ఆధారాలు లేకుండానే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి వేధించాడని బాధితులు చెబుతున్నారు. అలాగే, చిన్నతప్పిదాలకే సామాన్యులపై కేసులు పెట్టి వేధించేవారని పలువురు వాపోయారు.
- కరోనా సమయంలో ఇన్‌స్పెక్టర్ వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చినా విచారణ చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి.
- వరంగల్ - నర్సంపేట రోడ్డులో వ్యాపారులను బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన వ్యాపారులను టార్గెట్ చేసి వేధించినట్లు తెలిసింది.
- పీఎస్‌లోని స్క్రాబ్‌ను విక్రయించినా అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.
- నిఘా విభాగంలో పని చేసే ఓ అధికారి కుటుంబ సభ్యులకు చెందిన వ్యాపారంలో అవకతవకలు జరిగినా వారిని అరెస్ట్ చేయకుండా సదరు అధికారిని అడ్డుపెట్టుకుని తన ఆగడాలు కొనసాగించారని సమాచారం.